
సాక్షి పల్నాడు

బుధవారం । 16 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి తాడేపల్లికి చెందిన భక్తులు గుడివాక జయదేవ్ సూర్య, జయసూర్య ఆర్యన్ మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.3,700, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ విజయసాయిరెడ్డి రాక

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి బుధవారం బాపట్ల రానున్నారు. పట్టణంలోని కోన భవన్‌లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన శాసన సభ్యులు, ఇన్‌చార్జిలతోపాటు ఎంపీలు, మాజీ ఎమ్మెల్యే, ముఖ్య నేతలతో సమావేశం అవుతారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా



బాపట్ల: సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ చేరవేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌పై జాతీయ జెండాను మంగళవారం ఎగురవేశారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పుష్ప మాలలతో నివాళులర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తదుపరి అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో తేనీటి విందు



చీరాల అర్బన్: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా చీరాలలోని కలెక్టర్ బంగ్లాలో మంగళవారం రాత్రి కలెక్టర్ రంజిత్ బాషా తేనీటి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, కోన రఘుపతి, రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ రాష్ట్ర సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో స్వాతంత్ర్యోత్సాహం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మహనుభావుల త్యాగఫలితమే స్వాతంత్ర్యమని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు చెప్పారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు రేంజ్ క్యాంపు కార్యాలయంలో ఐజీ పాలరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. ఐజీ మాట్లాడుతూ త్యాగధనుల పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ప్రజాసేవకు పోలీసులు పునరంకితం కావాలని సూచించారు. ఏఎస్పీ (ఏఆర్) కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో.. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ జెండా ఎగురవేశారు. ఏఎస్పీలు కె.కోటేశ్వరరావు (ఏఆర్), డి.ఎస్.మహేష్ (ఎస్ఈబీ) పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి వెండి కిరీటం సమర్పణ

పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలోని స్వామికి దాతలు మంగళవారం వెండి కిరీటాన్ని సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. గుడివాడకు చెందిన బోయిన వీరరాఘవయ్య దంపతులు రూ.1.35 లక్షలు వెచ్చించి 1.546 కిలోల వెండితో వీరాంజనేయస్వామికి కిరీటాన్ని తయారు చేయించి, ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యుడు డి.డి.ప్రసాద్‌కు అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాచార్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సందేశం

హరివిల్లులోని సప్తవర్ణాలు మువ్వన్నెల్లో ఒదిగిపోయి మిలామిలా మెరిసినట్టు.. గగనాన జాతీయ పతాక సగర్వంగా రెపరెపలాడింది. నవరత్నాలు పొదిగిన సంక్షేమ వజ్రవైడూర్యాలు నడివీధిలో కవాతు చేసినట్టు.. ప్రగతి రథ చక్రాలు కదంతొక్కుతూ శంఖారావం పూరించాయి. అఖండ భారతావని ఒక్కసారిగా గళమెత్తి గర్జించినట్టు.. జనగణమన నినాదంతో దిక్కులన్నీ మార్మోగాయి. కీర్తిపతాక పిడికిట బిగిసి జయజయజయహే అంటూ గీతాలాపన చేసినట్టు.. అకుంఠిత దేశభక్తితో మంగళవారం ఊరూవాడా మురిశాయి.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

పల్నాడు ప్రగతి ప్రవర్ధమానం

- జిల్లా ఏర్పాటుతో ముంగిళ్లలోకే సేవలు
- నవరత్నాలతో గడపల్లో ఆనందాల సిరులు
- పిడుగురాళ్ల మెడికల్ కళాశాల, వరికపూడిశెల ప్రాజెక్టు పనుల్లో పురోగతి
- స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



స్వాతంత్ర్యోత్సవ సందేశం ఇస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, నరసరావుపేట: '' నాలుగేళ్లుగా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రభుత్వం సంతృప్తకరస్థాయిలో అందిస్తోంది. ప్రజల ముంగిళ్లలోకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి అందరితో కలిసి కృషి చేస్తా. తనను జిల్లా తొలి ఇన్‌చార్జి మంత్రిగా నియమించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు'' అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యఅతిథిగా కారుమూరి పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కొనియాడారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. పల్నాడు జిల్లా ఏర్పాటుతో జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఎన్ని కష్టాలున్నా.. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ క్యాలెండర్‌ను క్రమం తప్పకుండా అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్, ఇతర అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. **మంత్రి కారుమూరి ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..**

- జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 6.36 లక్షల మంది కార్డుదారులకు ఆగస్టు నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నాం. కొత్తగా 2,173 కొత్త రైస్‌కార్డులు మంజూరు చేశాం.
- రబీలో 303 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 2,518 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. రూ.5.16 కోట్ల చెల్లింపులు జరిపాం.
- 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా 95,155 మందికి ఇళ్లస్థల పట్టాలను పంపిణీ చేశాం. దీనికోసం రూ.287 కోట్లు ఖర్చుచేసి 2,853 ఎకరాల్లో 859 లేఅవుట్లను అభివృద్ధి చేశాం. తొలి దశలో సుమారు రూ.921 కోట్లు ఖర్చుచేసి 51 వేల గృహాల నిర్మాణాలు చేపట్టాం. టిడ్కో ద్వారా మొత్తం 12,512 గృహాలు మంజూరు కాగా ఇప్పటికే 6,016 ఇళ్లను లబ్ధిదారులకు అందించాం. మరో ఆరు వేల గృహాల పనులు పురోగతిలో ఉన్నాయి.
- భూరక్ష–భూహక్కు పథకం ద్వారా 109 గ్రామాల్లో 3.14 లక్షల ఎకరాల్లో రీసర్వే పూర్తయింది. మరో 254 గ్రామాల్లో 9.58 లక్షల ఎకరాల్లో సర్వే పురోగతిలో ఉంది. 49 వేల మందికి ఇప్పటికే భూహక్కు పత్రాలు జారీ చేశాం.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.495 కోట్లతో 2.10 లక్షల మందికి వివిధ ఆపరేషన్లు ఉచితంగా చేయించాం.
- నాడు–నేడు పథకం ద్వారా 32 పీహెచ్‌సీలకు మరమ్మతులు, ఏడు కొత్త పీహెచ్‌సీల నిర్మాణం చేపట్టాం. రూ.500 కోట్లతో చేపట్టిన పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా జిల్లాలోని 2.67 లక్షల మందికి రూ.1,498.69 కోట్లు అందజేశాం.
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా 2 లక్షల మందికి రూ.170.86 కోట్లు అందించాం.
- వైఎస్సార్ పల్నాడు దుర్భిక్ష నివారణ, వరికపూడిశెల పథకం పనులను రూ.6,360 కోట్లతో త్వరలో ప్రారంభించనున్నాం.
- 4,141 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యంగా ఉంది.
- ఈ ఖరీఫ్‌లో స్వల్పకాలిక పంట రుణాలుగా రూ.3,373 కోట్లు, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలుగా రూ.2,009 కోట్లు మంజూరు చేశాం.
- జిల్లాలో 87 వేల మంది రైతులకు 9 గంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.
- జగనన్న అమ్మఒడి పథకం ద్వారా 1.93 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.977 కోట్లు జమ చేశాం.
- జగనన్న విద్యా దీవెన ద్వారా సుమారు 42 వేల మంది పేద విద్యార్థులకు రూ.127.62 కోట్లు, జగన్న వసతి దీవెన ద్వారా 42 వేల మంది తల్లుల ఖాతాల్లో రూ.40.74 కోట్లు జమ చేశాం.
- మనబడి నాడు–నేడు రెండో దశలో 905 పాఠశాలలను రూ.308 కోట్లతో ఆధునికీకరిస్తున్నాం.
- 1.74 లక్షల మంది విద్యార్థులకు జగన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశాం.
- వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 2.68 లక్షల మందికి రూ.74.22 కోట్లు ప్రతినెలా ఇస్తున్నాం.
- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 95 వేల మందికి రూ.179 కోట్ల ఆర్థిక సహాయం అందించాం.
- వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 25,175 పొదుపు సంఘాలకు మూడో విడతగా రూ.192 కోట్లు లబ్ధి చేకూర్చాం.
- కాపునేస్తం ద్వారా 31,596 మందికి రూ.47.39 కోట్లు అందజేశాం.
- జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.30.68 కోట్లు సాయం చేశాం.
- ఈబీసీ నేస్తం ద్వారా 63,834 మందికి రూ.95.73 కోట్లు ఆర్థిక సహాయం చేశాం.
- ఉపాధి హామీ పథకం ద్వారా 73 లక్షల పని దినాలు కల్పించాం.
- రూ.2,212 కోట్ల పెట్టుబడితో 43 భారీ, మెగా పరిశ్రమలు స్థాపించడం వల్ల 15 వేల మందికి ఉపాధి లభిస్తోంది. రూ.2,854 కోట్ల పెట్టుబడితో మరో మూడు భారీ పరిశ్రమల ద్వారా 913 మందికి ఉపాధి కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి.
- రూ.148.95 కోట్లతో బెల్లంకొండ–అమరావతి రహదారి విస్తరణ, రూ.64 కోట్లతో మాదిపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు సాగుతున్నాయి.
- నరసరావుపేట ఆటోనగర్ నిర్మాణం కోసం కేసానుపల్లి వద్ద 18 ఎకరాల భూమిని గుర్తించాం.

మువ్వన్నెల మురిసే..



మువ్వ కట్టి నర్తించె : సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



త్రివర్ణశోభితమై మెరిసే : ఆకట్టుకున్న డ్యాన్స్ ప్రదర్శన

అచం'జల' సంకల్పం

- వినుకొండ, మాచర్ల మున్సిపాలిటీలకు వరం
- తీరనున్న తాగునీటి సమస్య
- రూ.249.11 కోట్ల ఏఐఐబీ నిధులతో తాగునీటి పథకం పనులు ప్రారంభం
- 1.23 లక్షల మందికి ప్రయోజనం



వినుకొండకు తాగునీరు అందించే సింగరచెరువు



కొత్తగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

వినుకొండ(నూజెండ్ల) : పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు 24 గంటలూ సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) సహకారంతో పల్నాడు జిల్లాలోని వినుకొండ, మాచర్ల పురపాలక సంఘాల్లో తాగునీటి పథకాల పనులు ప్రారంభించింది. వినుకొండ మున్సిపాలిటీకి రూ.166.11 కోట్లు, మాచర్ల పురపాలక సంఘానికి రూ.88 కోట్లు చొప్పున మొత్తం రూ.254.11 కోట్లు మంజూరయ్యాయి. వినుకొండలో 66వేల జనాభా, మాచర్లలో 57 వేల జనాభాకు మొత్తంగా 1.23 లక్షల మందికి ఈ పథకాల ద్వారా తాగునీరు అందనుంది.

ఏఐఐబీ పథకం ఇలా..

మున్సిపాలిటీ	నిధులు (రూ.కోట్లలో)	జనాభా
వినుకొండ	166.11	66,000
మాచర్ల	88.00	57,796

ఏడాది పొడవునా తాగునీటికి ఢోకా ఉండదు

వినుకొండ పట్టణంలో రూ.27 కోట్లతో మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, కొత్త పైపులైన్ నిర్మాణంతోపాటు రూ.125 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టారు. వినుకొండ సింగరచెరువుకు అనుసంధానంగా దొండపాడు చెరువు నుంచి మరో రూ.200 ఎకరాల విస్తీర్ణంలో స్టోరేజీ ట్యాంక్ నిర్మించనున్నారు. ఈ పథకం పూర్తయితే పట్టణంలోని రెడ్డినగర్, ధర్మపురికాలనీ, రైలుపేట, కల్యాణపురి కాలనీ, అంబేడ్కర్ నగర్, సిద్ధార్థనగర్‌తోపాటు శివారు ప్రాంతాల ప్రజలకు రోజూ తాగునీరు అందుతుంది. ప్రస్తుతం నాలుగు నెలలపాటు తాగునీటి సరఫరా అందించే వ్యవస్థ మున్సిపాలిటీకి అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాది పొడవునా తాగునీటి నిల్వలు ఉంటాయి. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. మాచర్ల పట్టణానికి తాగునీటి సౌకర్యం అందించేందుకు బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి పైపు లైన్ నిర్మాణానికి రూ. 88 కోట్లు కేటాయించారు.

శుభపరిణామం



వినుకొండ పట్టణంలోని ప్రజలు గతంలో తాగునీటికి కటకటలాడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఏఐబీ పథకం నిధులతో దొండపాడు చెరువుకు అనుసంధానంగా పథకం నిర్మాణం ప్రారంభమైంది. ఇది శుభపరిణామం.

– షేక్ షకీలా దస్తగిరి, 30వ వార్డు కౌన్సిలర్


శరవేగంగా పనులు



వినుకొండ మున్సిపాలిటీ 2005లో అవతరించినప్పటికీ తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. బొల్లా బ్రహ్మనాయుడు ఎమ్మెల్యే అయ్యాక తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. సింగరచెరువు ఆక్రమణలు తొలగించి 270 ఎకరాల విస్తీర్ణం పెంచారు. ఏఐబీ నిధులతో పట్టణంలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణంతోపాటు పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– నంది నరసింహారావు, 20వ వార్డు, వినుకొండ

పనులు సాగుతున్నాయి



గత ఏడాది ఆగస్టు 3వ తేదీన ఏఐబీ పథకం పనులకు శంకుస్థాపన జరిగింది. రూ.125 కోట్ల నిధులతో అధునాతన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తోపాటు ఎస్ఎస్‌పీ కాలనీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణంతోపాటు వెల్లటూరు రోడ్డులోని నూతన ట్యాంక్‌కు కూడా అనుసంధానం చేసి పట్టణ ప్రజలందరికీ 24 గంటలు తాగునీరు అందుబాటులోకి తీసుకొస్తాం. పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

– వెంకయ్య, మున్సిపల్ కమిషనర్, వినుకొండ

స్కూలు బస్సు బోల్తా

20 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు



వేమూరు: ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి కాలువలో పడింది. ఇరవై మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కూచిపూడి– పెదపూడి మధ్య చోటుచేసుకుంది. వివరాలు.. కూచిపూడి గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు 77వ స్వాతంత్ర్య వేడుకల అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపించేందుకు బయలుదేరింది. బస్సులో పెదపూడి, పెరవలిపాలెం, పెరవలి, చావలి గ్రామాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు పెదపూడి వైపు వెళ్తుండగా బస్సు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ అదే స్కూలుకు చెందిన మరో బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులోని విద్యార్థుల్లో 20 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తెనాలిలోని ప్రైవేటు హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనా స్థలాన్ని అమృతలూరు ఎస్ఐ సురేష్ పరిశీలించారు. రేపల్లె ఆర్డీఓ ఆర్.పార్థసారథి, అమృతలూరు తహసీల్దార్ మహ్మద్ సుభానీ, ఎంఈఓ కనపాల రమేష్, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

రూ.2 లక్షల విలువైన తెలంగాణ మద్యం స్వాధీనం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలంగాణకు చెందిన మద్యం సీసాలు తీసుకొచ్చి, విక్రయించే పాత నేరస్తుడిని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–2 పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద రూ.2 లక్షలు ఖరీదు చేసే ఫుల్, క్వార్టర్ బాటిళ్లు, ఆటో సీజ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని గుంటూరు–2 ఎస్ఈబీ(సెబ్) స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సెబ్ గుంటూరు ఏఎస్పీ డి.ఎన్.మహేష్ కేసు వివరాలను వెల్లడించారు. ముందస్తు సమాచారంతో మేడికొండూరు మండలం పేరేచర్ల జంక్షన్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా ప్రయాణికుల ఆటోలో వెనుక ఉన్న సీటు కింద తెలంగాణ మద్యం సీసాలను గుర్తించామని, ఆటో డ్రైవర్ ఇంతియాజ్‌ను అరెస్ట్ చేసి రూ.2 లక్షలు ఖరీదు చేసే 60 ఫుల్ బాటిళ్లు, 47 క్వార్టర్ సీసాలను సీజ్ చేశామని వివరించారు.

తాళాలు పగలగొట్టి ఇంటిలో చోరీ

రూ.పది లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

చేబ్రోలు: దైవ దర్శనం కోసం వెళ్లిన కొబ్బరి బోండాల వ్యాపారి ఇంటిలో దొంగలు చోరీకి తెగబడ్డారు. వడ్లమూడి గరువుపాలెంలో జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన కొబ్బరిబోండాల వ్యాపారి ఉయ్యూరు వెంకటేశ్వరరావు రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చిన వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు, కిటికీలు విరగగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూశారు. రెండు బీరువాలలోని రూ.2.10 లక్షల నగదు, 14 సవర్ల బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది.



చోరీ జరిగిన ఇల్లు

ఆర్టీసీ బస్సులో మహిళపై అసభ్య ప్రవర్తన

ఆకతాయికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన మహిళ బంధువులు



ముసామీన్

ప్రత్తిపాడు: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మహిళ మంగళవారం రాత్రి గుంటూరు నుంచి ప్రత్తిపాడుకు ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. అదే బస్సులో చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన షేక్ ముసామీన్ కూడా ఎక్కాడు. పుల్లడిగుంట దాటిన తరువాత బస్సులో నిలబడిన ఉన్న ముసామిన్ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ అతడితో గొడవ పడ్డారు. తోటి ప్రయాణికులు మహిళకు మద్దతుగా నిలిచారు. ముసామీన్ ప్రయాణికులపైనా అనుచితంగా ప్రవర్తించాడు. దూషణలకు దిగాడు. దీంతో మహిళ విషయాన్ని ఫోన్ ద్వారా తన బంధువులకు తెలియజేసింది. బస్సు ప్రత్తిపాడుకు చేరుకునే సమయానికి అక్కడికి చేరుకున్న మహిళ కుటుంబీకులు ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. బస్సు నుంచి బయటకు లాక్కొచ్చి చితకబాదారు. అనంతరం ప్రత్తిపాడు పోలీసులకు అప్పగించారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చేతుల మీదగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కె.వినాయకం డీఆర్‌ఓ | ఐ.మురళి, జేపీపీ | ఎస్.పద్మశ్రీ డీఎస్‌వో | కె.శామ్యూల్ డీఈఓ | ఎన్.రామచంద్రరావు డీఎఫ్‌ఓ | బీజే బెన్నీ, డీహెచ్‌ఓ | ఎస్.వేణుగోపాలరావు హౌసింగ్ పీడీ | డాక్టర్ బీవీ రంగారావు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ | డాక్టర్ జి.శోభారాణి డీఎంహెచ్‌ఓ | ముక్తేశ్వరరావు సీపీఓ | వసంతబాబు పీఏ టూ స్పెషల్ కలెక్టర్



ఎం.శేషిరెడ్డి నరసరావుపేట ఆర్‌డీఓ | బీఎల్ఎన్ రాజకుమారి సత్తెనపల్లి ఆర్‌డీఓ | రాజానాయక్ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ | ఓబుల్‌నాయుడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ | సంజీవరావు స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ | పరంధామరెడ్డి డీటీఓ | సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ | జోసఫ్‌కుమార్ డ్వామా పీడీ | ఆర్.రాఘవేంద్ర అడిషనల్ ఎస్పీ | ఎస్‌కె చంద్రశేఖర్ అడిషనల్ ఎస్పీ | రామచంద్రరాజు అడిషనల్ ఎస్పీ

ప్రతిభకు పురస్కారం

నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్తమ అధికారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నరసరావుపేట



బి.ఆదినారాయణ డీఎస్పీ, సత్తెనపల్లి | కెవి.మహేష్, డీఎస్పీ, నరసరావుపేట | పల్లపురాజు డీఎస్పీ, గురజాల | యు.రవిచంద్ర డీఎస్పీ, దిశ | చిన్నికృష్ణ డీఎస్పీ, ఏఆర్ | ఏ.అశోక్‌కుమార్ నరసరావుపేట వన్‌టౌన్ సీఐ | పి.వీరేంద్రబాబు నరసరావుపేట టూటౌన్ సీఐ | ఎం.రాంబాబు నరసరావుపేట ట్రాఫిక్ సీఐ



పి.భక్తవత్సలరెడ్డి నరసరావుపేట రూరల్ సీఐ | ఎస్.సాంబశివరావు వినుకొండ టౌన్ సీఐ | జి.రాజేశ్వరరావు చిలకలూరిపేట టౌన్ సీఐ | వై.అచ్చయ్య చిలకలూరిపేట రూరల్ సీఐ | ఏ.సురేంద్రబాబు దాచేపల్లి సీఐ | పీవి ఆంజనేయులు పిడుగురాళ్ల సీఐ | షేక్ షమీముల్లా మాచర్ల రూరల్ సీఐ | రవికిరణ్, ఆర్ఐ | ఎన్.వెంకటరమణ, ఆర్ఐ | ఎస్‌వీ రమణారెడ్డి ఆర్ఐ | డాక్టర్ కె.పద్మావతి, జిల్లా క్షయవ్యాధినివారణ అధికారి | డాక్టర్ జి.చంద్రశేఖర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ | డాక్టర్ కె.హనుమకుమార్ ప్రభుత్వ వైద్యుడు | కె.హరనాథ్, డీఈ, పంచాయతీరాజ్ శాఖ



మల్లికార్జునరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు | చంద్రారెడ్డి, సూపరింటెండెంట్, ఆర్‌డీఓ కార్యాలయం | ఎన్‌వి శ్రీనివాసరావు జిల్లా ప్రజారవాణా అధికారి | యు.నాగశ్రీనివాస్ డీసీఓ | దుర్గాభాయ్, ఈడీ బీసీ కార్పొరేషన్ | వైసీ సుబ్బరాయుడు డీపీఈఆర్‌ఓ | సయ్యద్ హమీన్ అహ్మద్ జేఐ సహకార శాఖ | షేక్ నబీ హవాబీ హాస్టల్ వార్డెన్ | కాకుమాను బాలహనుమంతరెడ్డి, జిల్లా కోర్టు, పీపీ | స్వర్ణ చినరామిరెడ్డి ఎస్‌డీఎల్‌సీఓ | టి.పద్మావతి జేఐ, సహకారశాఖ | కె. ప్రభాకరరావు జిల్లా ఎస్‌బీ, సీఐ | సీహెచ్ సురేష్, రొంపిచర్ల ఎస్ఐ | పి.కిషోర్‌రెడ్డి మేనేజర్, సీజీజీబీ

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



జెండా ఆవిష్కరించి, గౌరవ వందనం చేస్తున్న 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ. వెంకటనాగేశ్వరరావు



పోలీస్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ కె.వి. మహేష్

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మొదట సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరరావు ఆవిష్కరించారు. మహనీయుల సేవలను కొనియాడారు. న్యాయమూర్తులు ఆశీర్వాదం పాల్, కె.మధుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. న్యాయవాద సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఎగురవేశారు. అలాగే డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో డీఎస్పీ కె.వి.మహేష్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. రైల్వే పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండాను ఎస్ఐ టి.సుబ్బారావు ఎగురవేశారు. వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల ప్రాంగణాల్లో సీఐ అశోక్‌కుమార్, వీరేంద్రబాబులు జెండావిష్కరణ చేశారు.

క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటిన కలెక్టర్ కుటుంబం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, కుటుంబ సభ్యులు

గుంటూరు వెస్ట్: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కుటుంబ సభ్యులు స్థానిక కలెక్టర్ బంగ్లాలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మొక్కను నాటడమంటే ప్రకృతికి మనవంతు సాయం అందించడమేనని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు మొక్కలు నాటడంతోపాటు, వాటిని కాపాడడం ఎంత ముఖ్యమో చిన్నప్పటి నుంచే వివరించాలని సూచించారు. వీలైనంత వరకు ప్రతి ఇంటిలోనూ మొక్కలు నాటడం అలవర్చుకోవాలని కోరారు.

మహాత్మునికి జేసీ నివాళులు

స్థానిక కలెక్టరేట్‌లోని మహాత్మా గాంధీ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అలంకరించారు. స్వాతంత్య్ర పోరాటంలో మహాత్ముని పాత్ర ఎంత చెప్పినా తక్కువేనని కీర్తించారు.

ఆకట్టుకున్న శకటం.. అలరించిన సాంస్కృతికం



ప్రథమ బహుమతి సాధించిన వ్యవసాయశాఖ శకటం



ద్వితీయస్థానంలో నిలిచిన పశుసంవర్ధక, మత్స్యశాఖ శకటం



వేడుకలకు హాజరైన విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో మంగళవారం 77వ స్వాతంత్య్ర వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పల్నాడుజిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకలలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ శాఖలు జిల్లాలో సాధించిన ప్రగతిని వివరిస్తు శకటాలను ప్రదర్శించారు. ప్రకృతి సేద్యం, వ్యవసాయశాఖ, పశుసంవర్ధక, మత్స్యశాఖ, పౌరసరఫరాల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖ, అటవీశాఖ, గ్రామ, వార్డు సచివాలయాలు, గృహ నిర్మాణశాఖ, వైద్య,ఆరోగ్యశాఖ, నీటి యాజమాన్యసంస్థ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, పంచాయతీ శాఖలు తమ తమ శాఖల పనితీరును వివరిస్తు ప్రదర్శించిన శకటాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వ్యవసాయశాఖ ప్రథమ బహుమతి, పశుసంవర్ధక, మత్స్యశాఖ ద్వితీయ, పౌరసరఫరాలశాఖ తృతీయ బహుమతులు సాధించాయి. శకటాల ప్రదర్శన ఆసాంతం విద్యార్థులు కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. కాగా వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్స్ డ్యాన్స్ టీమ్ త్రివర్ణ భారతం, ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల వందేమాతరం, చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల విద్యార్థుల ఒకే ఒక పతాకం, ఆంధ్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థుల పల్నాడుజిల్లా గీతం అలరించాయి. విద్యార్థుల కేరింతలు, పట్టణ ప్రజల హర్షధ్వానాల మధ్య స్వాతంత్య్ర వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

తరగతి గదిలో భావి భారత నిర్మాణం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రామకృష్ణప్రసాద్



సీతారామయ్య విగ్రహానికి నివాళులర్పించిన జస్టిస్ రామకృష్ణప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: భావి భారత నిర్మాణం పాఠశాలల తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్లో నిర్వహించిన మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామకృష్ణప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆయన పాఠశాల వెలుపల ఉన్న ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు పాటిబండ్ల సీతారామయ్య కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజోపయోగ కార్యక్రమాలతో సామాజిక సేవా తత్పరునిగా తరించిన పాటిబండ్ల సీతారామయ్య చిరస్మరణీయులని, ఆయన్ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు శాస్త్రీయ నృత్య, దేశభక్తి గీతాలాపన, తైక్వాండో, యోగా, కర్రసాము ప్రదర్శన, మతాలన్నీ ఒకటే అని చాటి చెప్పేలా ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, మాదల రాజేంద్రప్రసాద్, మదమంచి రవీంద్ర, బొల్లేపల్లి శ్రీనివాస్, చిలుకూరి నరేంద్రబాబు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే శాఖ ఆధ్వర్యంలో మిన్నంటిన వేడుకలు



రైల్వే పోలీసులకు అభివాదం చేస్తున్న గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు నల్లపాడు రైల్వే పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ నేతృత్వంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ, ఐఆర్పీ సిబ్బంది, రైల్వే గుంటూరు డివిజనల్ శాఖధిపతులు జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ రైల్వే పోలీసులను కలసి అభివాదం పలికారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కూడా దేశ పోరాటంలో అమరులైన వారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి ప్రతి ఒక్కరినీ ఈ రోజు ప్రతి ఇంటా స్మరించుకోవాలని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. డివిజన్‌లో సంబంధిత విభాగాధిపతులకు, ఉద్యోగులకు డీఆర్‌ఎం అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు రైల్వే డివిజనల్ ఏడీఆర్‌ఎంలు శ్రీనివాస్, సైమాన్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ



కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న సీఈవో మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ అన్నారు. భారత జాతి ఐక్యంగా సాగించిన పోరాటాల ఫలితంగా లభించిన స్వేచ్ఛా, స్వాతంత్య్రాల ఫలాల్ని మరింత అప్రమత్తత, సమైక్యతా భావనతో నిలబెట్టుకోవాలన్నారు. దాన్ని ప్రతి పౌరుడూ తన బాధ్యతల్ని నిబద్ధతతో నెరవేర్చాలని సూచించారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మురళీకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం సాగించిన మహనీయుల్ని స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. బజరంగ్ నిర్మాణ సంస్థ సామాజిక సేవను కూడా త్రికరణశుద్ధితో నిర్వహిస్తూ, తన వంతు సామాజిక బాధ్యతను సంపూర్ణంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం నమోదు చేస్తున్న పురోగతి అసామాన్యమని కొనియాడారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు జి.సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్, ప్రాజెక్టు మేనేజర్ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.